

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 18-01-2025 | సంపుటి - 21 | సంచిక -270 | రూ : 4 | పేజీలు: 8




## యువత నైపుణ్య శిక్షణకు సింగపూర్ సహకారం

- **సంసిద్ధత వ్యక్తం చేసిన అక్కడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ఎడ్యుకేషన్**
- **సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటనలో తొలిరోజే కుదిరిన ఎంవోయూ**

హైదరాబాద్: సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఈ)తో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది. విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగ సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం నుంచి సింగపూర్ పర్యటన చేపట్టగా, మొదటి రోజునే ఈ ఎంవోయూ కుదిరింది. సీఎం రేవంత్, ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌ల సమక్షంలో స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఐటీఈ క్యాంపస్‌ను తెలంగాణ ప్రతినిధి బృందం సందర్శించింది. అక్కడ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించింది. శిక్షణ అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడింది. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాద్‌లోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సహకరించాలని రేవంత్ కోరారు.

తరువాయి 2లో

## పేదలకు రేషన్ పండగ

- **6.68 లక్షల కుటుంబాలతో ప్రాథమిక జాబితా**
- **సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా తయారీ**
- **వివరాలను జిల్లాలకు పంపిన పౌరసరఫరాల శాఖ**

హైదరాబాద్: పేదల సుదీర్ఘ నిరీక్షణ ఫలించనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 6.68 లక్షల కుటుంబాలు నూతన కార్డులకు అర్హమైనవిగా పౌరసరఫరాలశాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఈ జాబితాను రాష్ట్రంలోని 33 జిల్లాలకు పంపించింది. ఈ నెల 20 నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, బస్తీ సభలు నిర్వహిస్తారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత తుది జాబితా ఖరారవుతుంది. జిల్లా కలెక్టర్ల ద్వారా వచ్చే జాబితాల మేరకు పౌరసరఫరాల శాఖ కార్డులను మంజూరు చేస్తుంది. జనవరి 26న జారీ ప్రారంభం అవుతుంది.

*** సమాచారం వడబోత**

ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500కు గ్యాస్ సిలిండర్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ఆధారం కావడంతో బాగా డిమాండ్ ఉంది.



ఇంతక్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుని పరిశీలించేవారు. ఈసారి ప్రభుత్వం కొత్త పద్ధతిని అనుసరిస్తోంది. గత నవంబరులో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను ఆధారంగా చేసుకుంటోంది. ఆ సర్వే ద్వారా రేషన్‌కార్డులు లేనివారి వివరాలను పౌరసరఫరాల శాఖ తీసుకుంది. కొత్త కార్డులు కావాలన్నవారి, ఇప్పటికే ఉన్నకార్డుల్లో పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నవారి సమాచారాన్ని అధికారులు వడబోశారు. ఈ ప్రక్రియ తర్వాత 6,68,309 కుటుంబాలు

తరువాయి 2లో

## ఎన్డీయే 'ఉక్కు' సంకల్పం



- **విశాఖ ఉక్కుకు రూ. 11,440 కోట్ల ప్యాకేజీ**
- **రెండేళ్లలో దేశంలో నంబర్ 1గా నిలబెట్టడమే లక్ష్యం**
- **కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటన**
- **ప్రైవేటీకరణ ప్రసక్తే లేదని స్పష్టీకరణ**
- **'డబుల్ ఇంజిన్' విజయమన్న రామ్మోహన్‌నాయుడు**
- **సమస్య పరిష్కారం కావడం అదృష్టం: శ్రీనివాస వర్మ**

2లో

## మాట్లాడుతున్నారు.. నడుస్తున్నారు

- **సైఫ్ అలీఖాన్ ఆరోగ్య పరిస్థితిని వెల్లడించిన వైద్యులు**

ముంబయి: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్(54) ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని ముంబయిలోని లీలావతి వైద్యులు శుక్రవారం వెల్లడించారు. నిందితుడి దాడిలో సైఫ్ పెద్ద ప్రమాదం నుంచి

తరువాయి 2లో





## బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- **బీసీ మేధావుల సదస్సులో వక్తలు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు, మేధావులు, న్యాయనిపుణులు, సామాజికవేత్తలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయాలని బీసీ మేధావుల సదస్సులో వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించి పంచాయతీ రిజర్వేషన్ల పెంపు చట్టాన్ని ఆమోదించాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను కల్పించాలంటూ శుక్రవారం హైదరాబాద్‌లోని కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం నేతృత్వంలో బీసీ మేధావుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ.. త్వరలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో బీసీ కులగణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి,

తరువాయి 2లో




## ఫిర్యాదు... ఇక సులభం

- **'సంచార్ సాథీ' యాప్‌ను ఆవిష్కరించిన టెలికాం విభాగం**

దిల్లీ: మోసపూరిత ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లపై ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా 'సంచార్ సాథీ' మొబైల్ యాప్‌ను టెలికాం విభాగం ఆవిష్కరించింది. ఇది ఆండ్రాయిడ్, ఐవోఎస్.. రెండు ప్లాట్‌ఫామ్‌లపైనా పనిచేస్తుంది. మన ఫోన్‌కు కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చిన సమాచారం మోసపూరితమైనదనే అనుమానం కలిగితే.. ఈ యాప్ ద్వారా సులువుగా ఫిర్యాదు చేయొచ్చు. మొబైల్ ఫోన్ కాల్ లాగ్ (రిసీవ్డ్ కాల్స్ వివరాల) నుంచే నేరుగా ఈ విషయాన్ని తెలియజేయొచ్చు.

తరువాయి 2లో

## 31 నుంచి పార్లమెంటు సమావేశాలు

- **1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్**

దిల్లీ: పార్లమెంటు 202526 బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం ఉంటుంది. ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడతారు. 2024లో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది జులై 23న తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టారు. ఇప్పుడు రెండో బడ్జెట్ సభ ముందు ఉంచనున్నారు. ఈ సమావేశాలు తొలి విడత ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. తర్వాత మార్చి 9వ వరకు సెలవు ఉంటుంది. శాఖల వారీగా జరిపిన బడ్జెట్ పద్దులపై

తరువాయి 2లో



## శ్వేతసౌధంపై దాడి కేసు.. తెలుగు యువకుడికి ఎనిమిదేళ్ల జైలు

- **వీడ్కోలు ప్రసంగంలో బైడెన్ వ్యాఖ్య**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంపై ట్రక్కుతో దాడి చేసిన కేసులో తెలుగు సంతతి యువకుడు కందుల సాయివర్షిత్(20)కు ఎనిమిదేళ్ల జైలు శిక్ష పడింది. 2023 మే 22న జరిగిన ఘటనపై గురువారం స్థానిక కోర్టు తీర్పు వెలువరించింది. హైదరాబాద్‌లోని చందానగర్‌లో జన్మించిన సాయివర్షిత్ అమెరికా గ్రీన్‌కార్డు కలిగి ఉన్నాడు. ఆ యువకుడు 2023 మే 22 సాయంత్రం

తరువాయి 2లో



# ఎన్డీయే 'ఉక్కు' సంకల్పం

కొడిగట్టిన దీపంలా మిణుకుమిణుకుమంటున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఉజ్వలంగా వెలిగించేందుకు కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆర్థిక ఇంధనాన్ని అందించింది. ఎలాంటి ఒడుదొడుకులూ లేకుండా ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ దీన్ని ఆమోదించింది. తద్వారా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టడంలో 'ఉక్కు' సంకల్పాన్ని చాటింది. ఈ ప్యాకేజీ వివరాలను శుక్రవారం ఇక్కడ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి.. పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలతో కలిసి ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ఈ ప్రతిష్ఠాత్మక సంస్థను నిలబెట్టడానికే ఈ ప్యాకేజీ ప్రకటించామన్నారు. అందువల్ల ఇకపై విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అన్నదే ఉండదని భరోసా ఇచ్చారు. ప్రైవేటీకరించకూడదన్న లక్ష్యంతోనే ఈ కసరత్తు అంతా చేసినట్లు చెప్పారు. సెయిల్‌లో వైజాగ్ స్టీల్ విలీనం అంశం ప్రస్తుతానికి తమ ముందు లేదని పునరుద్ఘాటించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో విశాఖపట్నం ప్లాంట్‌ను ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే నం.1గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.



ఈ ప్యాకేజీలో రూ.10,300 కోట్లు ఈక్విటీ కేపిటల్‌గా, రూ.1,140 కోట్ల వర్కింగ్ కేపిటల్ లోన్‌ను 7% నాన్‌క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ కేపిటల్‌గా సమకూరుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్ఐఎన్ఎల్ యథాతథంగా నడవడానికి వీలుగా ఈ మొత్తాన్ని 10 ఏళ్ల తర్వాత రిడీమ్ చేయనున్నట్లు ప్రకటించారు.

# ఫిర్యాదు ఇక సులభం

(మొదటిపేజీ తరువాయి)

వినియోగదార్లు తమ పేరు మీద జారీ అయిన మొబైల్ కనెక్షన్ల వివరాలను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మన ధ్రువీకరణలతో ఎవరైనా ఫోన్ కనెక్షన్ తీసుకున్నారేమో తెలుసుకుని, అలాంటివి ఉంటే ఫిర్యాదు చేయడం ద్వారా తొలగింపచేయొచ్చు. మనం పోగొట్టుకున్న లేదా ఎవరైనా దొంగిలించిన మొబైల్ ఫోన్లను స్తంభింప చేయడం, కనుగొనే వీలు లాంటి ప్రత్యేకతలు కూడా ఈ యాప్‌లో ఉన్నాయి.

ఇప్పటికే అందుబాటులో పోర్టల్

ఇప్పటికే సంచార్ సాథీ పోర్టల్‌ను టెలికాం విభాగం అందుబాటులోకి తెచ్చింది. మోసపూరిత కాల్స్‌ను నియంత్రించే విషయంలో ఇది సమర్థంగా పనిచేస్తోంది. ఇప్పుడు మరింత సులువుగా వాడుకునేలా యాప్ కూడా రావడంతో మోసపూరిత కాల్స్‌కు అడ్డుకట్ట వేయడం సులువవుతుంది. వినియోగదారులకు భద్రతాపరంగా మరింత ప్రయోజనం కలుగుతుంది. ఈ యాప్‌తో పాటు విజన్ ఫర్ నేషనల్ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ 2.0, డిజిటల్ భారత్ నిధి కార్యక్రమాలను కూడా టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం దిల్లీలో ప్రారంభించారు. 'సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచడం ద్వారా ప్రతి ఒక్క వినియోగదారు గోప్యత, భద్రతను పరిరక్షించేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయ'ని మంత్రి తెలిపారు.

## అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు..

# అమిత్ కుమార్ గ్యాంగ్ కోసం పోలీసుల వేట

హైదరాబాద్: కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పది ప్రత్యేక బృందాలతో హైదరాబాద్ సహా రాయ్‌పుర్, బిహార్‌తో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసుల గాలింపు కొనసాగుతోంది. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి.. నగరంలోకి ప్రవేశించి ఇక్కడ నుంచి రాయ్‌పుర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు హైదరాబాద్‌కు ఎలా చేరుకున్నారనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముఠాలో ప్రధానంగా అమిత్‌కుమార్ కీలకంగా ఉన్నట్టు.. అతనిపై బిహార్‌లో దోపిడీ, దొంగతనం వంటి పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. బిహార్ పోలీసులను సంప్రదించిన నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే తెలుసుకున్నట్టు సమాచారం.




**బీభత్సం సృష్టించిన అమిత్ గ్యాంగ్..**

అమిత్ ముఠా కర్ణాటకలోని బీదర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి నగదుతో ద్విచక్ర వాహనంపై పరారై హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో రాయ్‌పుర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేయడం, కట్టలకొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడంతో నిందితులు ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతుకులు ఇంతటి తెగింపు ప్రదర్శించడం గమనార్హం.

# తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు..

## ఏప్రిల్ కోటా టికెట్ల విడుదల తేదీలివే!

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టాదళ పాదపద్మారాధన సేవకు సంబంధించి ఏప్రిల్ కోటా టికెట్లను జనవరి 18న ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) తెలిపింది. ఈ టికెట్ల కోసం జనవరి 18 నుంచి 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపింది. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు నిర్వహించనున్న స్వామివారి సాలకట్ల వసంతోత్సవాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలకు సంబంధించిన టికెట్లను జనవరి 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. వర్చువల్ సేవలు, దర్శన స్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఏప్రిల్ కోటాను జనవరి 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

*** మరిన్ని శ్రీవారి సేవలు.. టికెట్ల విడుదల తేదీలు**

* అంగ ప్రదక్షిణం కోటా జనవరి 23న ఉదయం 10 గంటలకు
* శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా జనవరి 23వ తేదీ ఉదయం 11 గంటలకు
* వృద్ధులు, దివ్యాంగుల దర్శనం కోటా జనవరి 23న మధ్యాహ్నం 3 గంటలకు
* ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300) టికెట్ల కోటా జనవరి 24న ఉదయం 10 గంటలకు
* తిరుమల, తిరుపతిలలో గదుల కోటా జనవరి 24న మధ్యాహ్నం 3 గంటలకు
* శ్రీవారి సాధారణ సేవ కోటా జనవరి 27న ఉదయం 11 గంటలకు
* శ్రీవారి నవనీత సేవ కోటా జనవరి 27న మధ్యాహ్నం 12 గంటలకు
* శ్రీవారి పరాకామణి సేవ కోటా జనవరి 27న మధ్యాహ్నం 1 గంటలకు విడుదల చేస్తారు.
* శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను తితిదే వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in లో మాత్రమే బుక్ చేసుకోవాలని భక్తులకు తితిదే సూచించింది.

## యువత నైపుణ్య శిక్షణకు సింగపూర్ సహకారం

(మొదటిపేజీ తరువాయి)

వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించి శిక్షణలో సహకారం అందించాలని కోరారు. ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది.

**ఐటీఈ ఏం చేస్తోందంటే...**

సింగపూర్ ఐటీఈ... టెన్త్ విద్యార్థుల స్థాయి నుంచి, చదువు పూర్తి చేసిన యువత వరకు, అలాగే ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో ఉద్యోగానికి సిద్ధమయ్యేలా శిక్షణనిస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫ్యూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' నినాదంతో పనిచేస్తున్న ఈ సంస్థలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం 100 ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ దొరుకుతుంది. ఇందుకోసం ఈ సంస్థతో 5,000 పరిశ్రమలకు భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు వాటి అవసరాలకు తగ్గట్లుగా నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. ఇదే స్ఫూర్తితో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ యువతకు సింగపూర్ ఐటీఈతో శిక్షణ ఇప్పించేలా ఒప్పందం కుదుర్చుకుంది. తాజా ఎంవోయూ వల్ల ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. నైపుణ్యాభివృద్ధికి సహకారం లభిస్తుందని వెల్లడించింది. ''ఈ భాగస్వామ్యం మౌలిక సదుపాయాల అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన వనరులు, పర్యాటకం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలలో దీర్ఘకాలిక సహకారానికి మార్గం సుగమం చేస్తుంది. ఈ పర్యటన తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్ సందర్శించనుంది. సీఎం బృందంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులున్నారు.

## పేదలకు రేషన్ పండగ

కొత్త కార్డులకు అర్హమైనవిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ కుటుంబాల్లో 11,65,052 మంది పేర్లు ఉన్నాయి. గ్రామ, బస్తీ సభల తర్వాత కొత్త కార్డులు... అందులో లబ్ధిదారుల సంఖ్యలో హెచ్చుతగ్గులు ఉంటాయి. ప్రాథమిక జాబితా ప్రకారం హైదరాబాద్‌లో అత్యధికంగా 83,285, వనపర్తి జిల్లాలో అత్యల్పంగా 6,647 కుటుంబాలకు కార్డులు వచ్చే అవకాశం ఉంది.

**రేవంత్, ఉత్తమ్ సంతకాలతో**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతకాలతో కూడిన లేఖ రూపంలో కొత్త కార్డులు ఇస్తారు. కొంతకాలం తర్వాత పాతవారికి, కొత్తవారికి కొత్త రూపంలో రేషన్‌కార్డులు జారీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం.డిజైన్ ఖరారు కావాల్సి ఉంది.

## బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఏఐసీసీ ఓబీసీ విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటస్వామితో పాటు బీసీ కుల సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరై మాట్లాడారు. వివిధ సంఘాల ప్రతినిధులు మేకల రాములు, గొరిగె మల్లేశ్, నీలం వెంకటేశ్, నందగోపాల్, వేముల రామకృష్ణ, అనంతయ్య, రాజేందర్, చింతల శంకర్, గుండేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 31 నుంచి పార్లమెంటు సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటు స్థాయీ సంఘాలు అధ్యయనం చేసి నివేదికలు సమర్పించడానికి ఆ సమయం కేటాయిస్తారు. తర్వాత మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు సాగుతాయి. తొలి విడత సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చిస్తారు. మలి విడతలో బడ్జెట్, శాఖలవారీ పద్దులకు ఆమోదం తెలుపుతారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, ఫిబ్రవరి 12న సంత్‌రవిదాస్ జయంతి సందర్భంగా పార్లమెంటుకు సెలవు ఉంటుంది.

## మాట్లాడుతున్నారు.. నడుస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

తప్పించుకున్నారన్నారు. దాడిలో కత్తి సైఫ్ వెన్నెముకకు రెండు మిల్లీమీటర్ల దూరంలో ఆగిందని చెప్పారు. లేదంటే ఆయన వెన్నెముకకు తీవ్రగాయం అయ్యేదని తెలిపారు. ''సైఫ్ మాట్లాడగలుగుతున్నారు. నడవగలుగుతున్నారు. చేయి, మెడపై గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ చేశాం. శరీరం నుంచి పదునైన వస్తువును బయటకు తీశాం. వెన్నెముకకు ఎటువంటి ప్రమాదం లేదు. ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు మార్చాం. ప్రస్తుతం ఆహారం తీసుకుంటున్నారు. రెండుమూడు రోజుల తర్వాత డిశ్చార్జి చేస్తాం'' అని వైద్యులు మీడియాకు తెలిపారు. సైఫ్‌ను ఆయన కుమార్తె సారా అలీఖాన్ పరామర్శించారు.

**ఇంకా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు**

ఈ కేసుకు సంబంధించి సైఫ్ ఇంట్లో రెండు రోజుల క్రితం పనిచేసిన కార్పెంటర్ వారిస్ అలీ సల్మానీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం అతడిని విడిచిపెట్టారు. అతడికి సైఫ్‌పై దాడికి సంబంధంలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటి వరకూ ఇంకా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని తెలిపారు. నిందితుడి కోసం 30 పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయన్నారు. ప్రాథమిక సమాచారం మేరకు అతనికి ఎటువంటి ముఠాలతో సంబంధం లేదని చెప్పారు.

## శ్వేతసౌధంపై దాడి కేసు.. తెలుగు యువకుడికి ఎనిమిదేళ్ల జైలు

మిస్సోరిలోని సెయింట్ లూయి నుంచి వాషింగ్టన్‌కు చేరుకున్నట్లు కోర్టు పత్రాల్లో పేర్కొన్నారు. అక్కడ ఓ ట్రక్కును అద్దెకు తీసుకుని రాత్రి 9:35 గంటల ప్రాంతంలో శ్వేతసౌధం వద్దకు చేరుకుని అక్కడి బారికేడ్లను ఢీకొట్టాడు. అనంతరం సాయివర్షిత్ తన బ్యాగులో నుంచి తెలుపు, ఎరుగు రంగులతో కూడిన నాజీల స్వస్తిక్ గుర్తు జెండాను ప్రదర్శించాడు. ఘటనా స్థలంలోనే పోలీసులు అతణ్ని నిర్బంధించారు. అధ్యక్షుడు బైడెన్‌ను హత్య చేయాలనే లక్ష్యంతో ఉద్దేశపూర్వకంగానే సాయి వర్షిత్ ఈ దాడికి యత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిందితుడు విచారణలో అంగీకరించినట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ వర్గాలు మీడియాకు తెలిపాయి. తాజాగా జిల్లా కోర్టు జడ్జి నిందితుడికి జైలు శిక్ష విధించారు. విడుదలైన అనంతరం మరో మూడేళ్లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీ చిత్తారమ్మ దేవి జాతర





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భక్తుల కోంగు బంగారమైన గాజులమారం గ్రామంలో వెలసిన శ్రీ చిత్తారమ్మ దేవి జాతర స్వర్ణోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యావచనము, పంచగవ్య ప్రాశన, దీక్షదారణ మంటపారాధన , అగ్ని ప్రతిష్టాపణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని బొనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

* **ఈ నెల 19 న అమ్మవారి ప్రధాన జాతర**

ఆదివారం ఉదయం అభిషేకం, విజయ దర్శనం అనంతరం తలంబ్రాలతో ఒడి బియ్యం, అమ్మవారి కి పూజలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం బొనాలు తీయుట, గాజులరామారం నుంచి శ్రీ చిత్తారమ్మ ఆలయం వరకు పోతురాజుల నృత్యాలతో ఉరేగింపు నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, బాలరాజు, నరసింహ, జి నరసింహ, ఇంద్రసేన గుప్తా, సత్తయ్య, శంకర్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి,పెంటారెడ్డి, బుచ్చిరెడ్డి , గౌరిశెట్టి శివ లతో పాటు తదితరులు పాల్గొన్నారు..

## ప్రతి ఒక్కరూ మానసికంగా,శారీరకంగా దృఢత్వాన్ని కలిగి ఉండాలి

**: డీఎస్పీ రెహమాన్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హేమచంద్రాపురం లో జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జిల్లా ఏఆర్ సిబ్బందికి శుక్రవారం మొబైలైజేషన్ పరేడ్ కార్యక్రమం ప్రారంభమయ్యింది.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ పాల్గొన్నారు.శుక్రవారం నుండి 15 రోజుల పాటు జరిగే ఈ మొబలైజేషన్ కార్యక్రమంలో పోలీసు శాఖలో కాలానుగుణంగా అనుసరిస్తున్న శిక్షణను ఏఆర్ సిబ్బందికి అందించనున్నారు.పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ మానసికంగా,శారీరకంగా దృఢత్వం కలిగి ఉన్నప్పుడే బాధ్యతాయతమైన విధులను క్రమశిక్షణతో నిర్వర్తించగలుగుతారని డిఎస్పీ రెహమాన్ ఈ సందర్భంగా అన్నారు.పోలీస్ శాఖలో క్రమశిక్షణ అనేది చాలా కీలకమని అందుకు అనుగుణంగా అందరూ భాధ్యతగా పనిచేయాలని తెలిపారు. రిఫ్రెష్ కోర్స్ లాంటి మొబలైజేషన్ ఆర్మడ్ రిజర్వ్ సిబ్బందికి చాలా కీలకమని అన్నారు.శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను మర్చిపోకుండా ఉండటంతో పాటు శారీరకంగా దృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని తెలిపారు.పదిహేను రోజుల పాటు ఉత్సాహంగా పాల్గొని గతంలో శిక్షణలో పొందిన మెళుకువలను నివృత్తి చేసుకుంటూ ఇండోర్,ఔట్డోర్,ఫైరింగ్ ప్రాక్టీస్ లో ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. నిరంతరం విధులలో ఉండే పోలీసు అధికారులు,సిబ్బందికి వ్యక్తిగత ,కుటుంబపరమైన,శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లపుడూ ముందుంటామని వివరించారు.ఈ శిక్షణాకాలంలో ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఎంటిఓ సుధాకర్,హోంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు , ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించిన తపస్



హయత్నగర్, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ బలపరిచిని ముగ్గురు అభ్యర్థులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మద్దతు ప్రకటించింది. శుక్రవారం హయత్ నగర్ లో తపస్ రాష్ట్ర కమిటి, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి హన్మంతరావు, నవాత్ సురేష్ లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - మెదక్ - ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - మెదక్ - ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తం రెడ్డి తపస్ సమావేశానికి హాజరై ఈ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశానికి బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించి ఉపాధ్యాయుల సమస్యలపై చట్టసభలో మాట్లాడేలా చేయడంలో తపస్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఇప్పుడు బీజేపీ బలపరిచిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కమిటీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో మాట్లాడి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సమావేశం లో అభ్యర్థులు మల్క కొమరయ్య, సీ. అంజిరెడ్డి, పులి సరోత్తం రెడ్డి, ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధులు లక్ష్మణ్ జీ, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్రావు, రాష్ట్ర పదాధికారులు నరేందర్ రావు, పాపిరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు బండి రమేష్, తెల్కలపల్లి పెంటయ్య, రామకృష్ణ రెడ్డి లు పాల్గొన్నారు.

## అల్వాల్ నూతన ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య సేవల పునఃప్రారంభం

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : అల్వాల్ నూతన ప్రాధమిక



ఆరోగ్య కేంద్రం లో వైద్య సేవల పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సమన్వయం , మానిటరింగ్ కమిటీ సమావేశంలో జరిగిన చర్చల ప్రకారం అందించిన సూచనల మేరకు జిహెచ్ఎంసి హాల్, వెంకటాపూర్ లో ప్రస్తుతము పనిచేస్తున్న ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ,ఆరోగ్య అధికారి డా. టి. రఘునాథ్ స్వామి చర్యలు తీసుకుందన్నారు. అల్వాల్ లో నూతనంగా నిర్మించిన భవనంలో వైద్య సేవలను పునఃప్రారంభించి, అన్ని రోగులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సౌకర్యంలో పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు, సామాన్య ప్రజలకు అవసరమైన వైద్య సేవలను సౌకర్యవంతమైన విధానంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. జిల్లా వైద్య , ఆరోగ్య కార్యాలయం ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి కట్టుబడి ఉందన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే

## ప్రజాస్ఫూర్తి దిన పత్రిక ప్రధాన లక్ష్యం

* **కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాస్ఫూర్తి దిన పత్రిక ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 2025 నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాస్ఫూర్తి దిన పత్రిక రూపోందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం నిజాంపేటలోని ఆయన కార్యాలయంలో పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకవస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న ప్రజాస్ఫూర్తి దిన పత్రికకు అభినందనలు తెలియజేశారు. ప్రజాస్ఫూర్తి దిన పత్రిక మరింతగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్ఫూర్తి దిన పత్రిక ఎడిటర్, టీయూడబ్ల్యుజే ఏజేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, సీనియర్ జర్నలిస్టు సాయిబాబా, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మచ్చలేని మార్క్సిస్టు మహానాయకుడు జ్యోతిబసు

* **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మచ్చలేని మాక్సిస్టూ మహా నాయకుడు జ్యోతిబసు అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు స్థానిక మంచి కంటి భవన్లో సిపిఎం మొదటి బ్యూరో సభ్యులు బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 15వ వర్ధంతి కార్యక్రమం జరిగింది ముందుగా జ్యోతిబసు చిత్రపటానికి మచ్చ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిపిఎం వ్యవస్థాపకులలో ఒకరిగా భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఎనలేని సేవలు అందించారన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రిగా 23 సంవత్సరాల పాటు పనిచేసి బెంగాల్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేకించి భూసంస్కరణలు తీసుకొచ్చి 14 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయడంలో పేదరికం నుండి బెంగాల్ ప్రజలను ఆదుకోవడంలో జ్యోతిబసు ముఖ్యమంత్రిగా కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో బెంగాల్ రాష్ట్రంలో ఎలాంటి మత ఘర్షణలకు అవకాశం లేదని మతసామరస్యం కాపాడే విధంగా పరిపాలించారని తెలిపారు. నేడు బిజెపి అనుసరిస్తున్న మతోన్మాది విధానాల నుండి భారత ప్రజాస్వామ్యం కల్పించిన మతసామరస్యాన్ని కాపాడడానికి పోరాటాల నిర్వహించడమే జ్యోతిబస్కు అందించే ఘనమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు, కొండపల్లి శ్రీధర్ జిలకర పద్మ ,భూక్య రమేష్, నాయకులు డి వీరన్న ,ఎం. వి అప్పారావు ,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుంది

* **పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) :. పేదవారి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు అమలు కై ఈ నెల 16 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు జరిగే అర్హుల ఎంపిక సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీ లో జరుగుతున్న సర్వే కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొని సర్వే జరుతున్న తీరు ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ . ప్రతి పేదవాడికి సంక్షేమ పథకం అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులందరికి న్యాయం జరుగుతుందని, సర్వే కోసం వచ్చినా అధికారుల బృందానికి వాస్తవాలు చెబుతూ అన్ని వివరాలను అందించాలన్నారు. తప్పుడు సమాచారం ఇవ్వకూడదన్నారు. ఈ నెల 16 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు అధికారుల బృందాలు పర్యటించి అర్హులను గుర్తిస్తాయి అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. పేదవారు కన్న కల ఇందిరమ్మ ఇల్లు అని,పేదవారికి భారం కాకుండా ప్రభుత్వం అన్ని రకాల నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైతే సొంత స్థలంలో ఉంటారో వారి ఇంటి ఫోటో తీసి యాప్ లో నమోదు చేస్తారన్నారు. ఈ చక్కటి అవకాశం ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వినతులను పరిష్కరించేందుకు విధివిధానాలను ఖరారు చేసింది. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ చక్కటి సదవకాశం ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎ.ఎం.సి కె.శ్రీనివాస్, ఎఈ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సి.ఓ ముస్తఫా , నాయకులు పాండుగౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, రవీందర్ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడే వారికి అండగా ఉంటా

* **ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



దమ్మపేట, ప్రజాస్ఫూర్తి: అశ్వరావుపేట నియోజకవర్గం లోని వివిధ గ్రామాల్లో, మండలాల్లో, పర్యటనలో భాగంగా అనంతరం గ్రామం లో రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు పోగొట్టుకున్న గడ్డం రాజు ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి పంపించి కృత్రిమ కాలు ఏర్పాటు చేయిస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చినారు.అదేవిధంగా ఇంకా అనేక గ్రామాల్లో అనారోగ్య కారణంతో బాధపడుతున్న ప్రజలను స్వయంగా కలిసి వారి ఇబ్బందులను తెలుసుకొని వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యం

* **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
* **జిన్నారం మండలంలో మూడు కోట్ల 90 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 17: పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి పల్లె సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అందూరు, రాళ్లకత్వ, సోలక్ పల్లి, ఊట్ల,వావిలాల, జంగంపేట, జిన్నారం, కొర్లకుంట, కొడకంచి, అలీ నగర్ తదితర గ్రామాలలో మూడు కోట్ల 90 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాలలో మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు వడ్డే కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

* అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇండ్లు అయినా సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను శుక్రవారం అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి, లక్ష్మీపురం మరియు కోయగూడెం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు.పాల్వంచ మండలం కోడిపుంజుల వాగు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సర్వేను పరిశీలించిన జడ్పీ సీఈవో నాగలక్ష్మి. జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురం గ్రామంలో జరుగుతున్నటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించిన పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి.అశ్వరావు పేట మండలం ఆసుపాక గ్రామంలో జరుగుతున్న సర్వే ను పరిశీలించిన అశ్వరావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, ఎంపీడీవో , ఎంపీవో బూర్గంపాడు మండలం పినపాక పట్టి నగర్, మొరంపల్లి బంజారా, లక్ష్మీపురం మరియుఇరవైండి గ్రామాలలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ,స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో , ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# అవును.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు




రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: వయసైపోయి.. వృద్ధాశ్రమంలో ఉన్న వారిద్దరికీ మనసులు కలిశాయి. వయసులో ఉన్నప్పటి కంటే.. ఇప్పుడే ఒకరికి ఒకరి తోడు ఉండాల్సిన అవసరాన్ని వారు గుర్తించారు. తామిద్దరం ఇష్టపడ్డామని, పెళ్లి చేసుకుంటామని నిర్వాహకులకు చెప్పారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులే పెళ్లి పెద్దలుగా మారి.. వారిద్దరినీ ఒకటి చేశారు. రాజమహేంద్రవరంలోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ఈ పెళ్లికి వేదికైంది వైఎస్సార్ జిల్లా పెనగలూరు మండలం కమ్మలకుంటకు చెందిన గజ్జల రాములమ్మ(68), రాజమహేంద్రవరం నారాయణపురానికి చెందిన మడగల మూర్తి(64) ఇద్దరూ ఈ ఆశ్రమంలో ఉంటున్నారు. రెండేళ్లుగా ఆశ్రమంలో ఉంటున్న మూర్తి పక్షవాతంతో బాధపడుతున్నారు. ఎవరో ఒకరి సాయం తప్పనిసరి. ఆ సమయంలో రాములమ్మ సహకారంతో మూర్తి కోలుకున్నారు. ఆమెను పెళ్లి చేసుకోవాలని భావించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు చెప్పడంతో శుక్రవారం వీరికి పెళ్లి చేయించారు.

# రైతులు సోలార్ విద్యుత్ ద్వారా పంటలు పండించుకోవడం చాలా సంతోషకరం

* ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాలలో కరెంట్ సౌకర్యం లేని పంట భూములలో బోర్వెల్ వేసుకొని ప్రత్యామ్నాయంగా సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకొని సంవత్సరానికి రెండు పంటలు పండించుకొని జీవనోపాధి పెంపొందించుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం బొజ్జలగూడెం, లక్ష్మీపురం, బంగారుచలక, గ్రామంలోని రైతులు కరెంటు సౌకర్యం లేకపోవడం వలన సోలార్ ద్వారా బోర్వెల్ పంపు సెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించుకొని పంటలు పండిస్తున్న వారి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు సౌకర్యం లేక చాలామంది రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి పంటలు పండించు కుంటున్నారని, చాలా గ్రామాలలో గిరిజనుల పంట పొలాలు నీటి సౌకర్యం లేక బీడు భూములుగా మారిపోతున్నాయని అన్నారు.ఈ గ్రామంలోని రైతులు సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకొని పంటలు పండించుకోవడం చాలా సంతోషకరమని ఈ సందర్భంగా రైతులను అభినందిస్తూ, ఈ ఆలోచన ఎవరి ద్వారా వచ్చిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మా గ్రామంలో నీటి సౌకర్యం లేక పంటలు పండించలేక చాలా భూములు బీడు భూములుగా మారిపోయాయని, 2017 18 సంవత్సరంలో రెడ్ కో సంస్థ వారు గిరిజన రైతులకు ప్రత్యేకంగా సలహాలు, సూచనలు ఇచ్చి సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ముందుకు రావడంతో గ్రామంలోని రైతుల అందరం కలిసి బోర్ వెల్స్ తవ్వించుకున్నామని, ఈ బోర్వెల్స్ కి సోలార్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో సంవత్సరానికి రెండు పంటలు పండించుకుంటున్నామని, దాదాపు పది ఎకరాల వరకు వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటున్నామని అన్నారు. సోలార్ తో పాటు మా భూములకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తే తప్పనిసరిగా పంటలు విరివిగా పండించుకొని మా భూములు సస్యశ్యామలము అయ్యేలా చూసుకుంటామని రైతులు పీవో కి తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, మైనింగ్ ఏ డి ఈ రమేష్, రెడ్కో జిఎం అజయ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ రఘురామయ్య, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ ఏఈ మునీర్ పాషా ఫారెస్ట్ జాయింట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠకులకు చేరువలో ప్రజా' దీవెన'

* క్యాలెండర్ ఆవిష్కరణలో ఎస్పీ శరత్ చంద్ర పవార్




ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : పాఠ కులకు అభిరు చికి అనుగుణంగా అప్రతిహతంగా ప్రజా దీవెన డిజిటల్ దినపత్రిక ముందుకు సాగుతోందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరిం చుకొని ప్రజా 'దీవెన '2025 నూత న సంవత్సర క్యాలెండర్ ను శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా దీవెన పత్రిక బ్యూరో చీఫ్, జిల్లా జర్న లిస్టు యూనియన్ అధ్యక్షుడు గుండగోని జయశంకర్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీడియా రంగంలో ప్రస్తుతం డిజిటల్ మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. పత్రికారంగం నిర్దిష్ట నియమావళి ప్రకారం డిజిటల్ మీడియా తనకు తానుగా లైన్ నిర్దేశించుకుని మంచి విలువలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల వార్తలు అతితక్కువ సమ యంలో సమాజానికి అందిస్తున్న ప్రజా దీవెన మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నల్లగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పులిమామిడి మహేందర్ రెడ్డి, గాదె రమేష్ లు మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ గుండగోని జయ శంకర్ ఆధ్వర్యం లో వెలువడుతున్న ప్రజా దీవెన డిజిటల్ దినపత్రిక, వెబ్ సైట్ దినది నాభివృద్ధి చెంది మరింత బలోపేతంతో ముందుకు సాగాలని ఆకాం క్షించారు. ప్రజా దీవెన నల్లగొండ బ్యూరో ఇంచార్జ్ మధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ ప్రెస్ క్లబ్ కోశాధికారి దండంపల్లి రవికు మార్, ప్రెస్ క్లబ్ ప్రచార కార్యదర్శి ఉబ్బని సైదులు, వెంకట్ రెడ్డి, స ల్వాది జానయ్య, వీడియో జర్న లిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లి మల్లేష్ యాదవ్, జానీ, ముచ్చర్ల శ్రీనివాస్, రాజు, బోగారి రామకృష్ణ, కత్తుల హరి, స్వామీ, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ మున్సిపాలిటీలో.. ప్రజా దీవెన డిజిటల్ దినపత్రిక 2025 క్యాలెండర్ ను నల్లగొండ మున్సి పల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి శుక్ర వారం ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, గణే ష్, మోహన్ బాబు, కలీల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం

* ఆస్ట్రేలియా బృందంతో మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: తెలంగాణలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సీఎం నిర్ణయించారని పీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ శివసేనారెడ్డి నేతృత్వంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి, హాకీ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మహ్మద్ ఫహీం ఖురేషీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, శాప్ ఎండీ సోనీ బాల ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. మెల్‌బోర్న్ నగరంలో శుక్రవారం అక్కడి ప్రభుత్వ అధికారుల ప్రతినిధి బృందంతో సమావేశమై ఆస్ట్రేలియాలో క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. తెలంగాణలో ప్రత్యేకంగా క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. క్రీడాకారులకు ఆర్థిక సహకారంతో పాటు అత్యాధునిక సాంకేతికతతో శిక్షణ ఇస్తున్నట్లు ఆస్ట్రేలియా అధికారులు చెప్పారు.

# కుంభమేళాలో ఈ భక్తులకు ఫ్రీ ఫుడ్, వసతి.. వివరాల కోసం కాల్ చేయండి..

ప్రపంచంలో అతిపెద్ద మతపరమైన వేడుకల్లో ఒకటైన మహా కుంభమేళా 2025 (Kumbh Mela 2025) ఈసారి ప్రయాగ్‌రాజ్ (ప్రయాగ్ రాజ్)లో ఘనంగా జరుగుతోంది. ఈ పుణ్య సన్నిధిలో గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం వద్ద భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పవిత్ర స్నానాలు చేస్తున్నారు. ఈ మహా కుంభమేళా 2025 జనవరి 13న మొదలుకాగా, ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ సమయంలో దాదాపు 45 కోట్ల మంది భక్తులు ఇక్కడికి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

## ఈ సౌకర్యాలు ఉచితం..

ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున వస్తున్న భక్తులకు సౌకర్యవంతమైన వసతి, ఆహారం, వైద్య సేవలు అందించడం కీలకమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ రాష్ట్ర భక్తులకు ఈ కుంభమేళాలో ఉచిత వసతి, ఆహారం, వైద్య సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. కుంభమేళా 2025లో రాజస్థాన్ భక్తుల కోసం ప్రత్యేకంగా 'రాజస్థాన్ మండపం'ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ తెలిపారు. ఈ మండపంలో భక్తులు ఉచితంగా ఆహారం, వసతి పొందవచ్చన్నారు.

## ఏర్పాట్లు ఎలా ఉన్నాయంటే..

ఇందులో 49 టెంట్లు, 30 పడకల డార్మిటరీ, డబుల్ బెడ్ లెట్యూస్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ ఏర్పాట్లు మహా కుంభమేళాలో పాల్గొనే భక్తులకు మరింత సౌకర్యాన్ని కల్పించేందుకు రూపొందించబడ్డాయి. ప్రత్యేకంగా రాజస్థాన్ నుంచి వచ్చే భక్తులకు మోని అమావాస్య, బసంత పంచమి, మాఘ పూర్ణిమ, మహాశివరాత్రి వంటి ముఖ్యమైన వేళల్లో సహాయం అందించనున్నారు. ఈ సమయంలో భక్తులు రాజ స్నానంతో పాటు ప్రత్యేక పూజలు చేసి దర్శనాలు చేసుకుంటారు. ఈ జాతరలో పాల్గొనే రాజస్థాన్ భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా పుణ్య ఫలాలు పొందాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజస్థాన్ సీఎం తెలిపారు.

## ఈ సేవల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు

భక్తులు ఈ సౌకర్యాలను ఉపయోగించుకునేందుకు 'రాజస్థాన్ మండపం' వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. అధికారిక ప్రకటన ప్రకారం, భక్తులు తమకు కావలసిన సమాచారం కోసం ఈ క్రింది హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చు:

కంట్రోల్ రూమ్: 9929860529,



9887812885

దేవస్థాన్ శాఖ రాష్ట్ర కంట్రోల్ రూమ్: 0294-2426130

ఈ నంబర్ల ద్వారా భక్తులు ఎటువంటి సమస్యలకు పరిష్కారం పొందవచ్చు.

## తెలుగు రాష్ట్రాల భక్తుల డిమాండ్

ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా 2025లో మొదటి రెండు రోజుల్లోనే 5.20 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఇందులో జనవరి 13న 1.70 కోట్ల మంది భక్తులు స్నానాలు చేయగా, జనవరి 14న మరింతగా 3.50 కోట్ల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సమయంలో మరింత భక్తులకు సౌకర్యంగా సేవలు అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను సమర్థంగా చేపడుతున్నారు. ఈ క్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తులకు కూడా ఈ రాష్ట్రాల సీఎంలు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

# బెస్ట్ డెస్టినేషన్ 'అరకు'




చాలా మందికి ట్రావెలింగ్ అంటే ప్రాణం. ఎప్పుడూ కొత్త ప్రదేశాలను ఎక్స్‌ప్లోర్ చేయాలని, కొత్తదనాన్ని ఆస్వాదించాలని అనుకుంటారు. కానీ ఎక్కడి వెళ్లాలో అర్థం కాక సతమతమవుతుంటారు. నిజం చెప్పాలంటే ఎక్కడికి వెళ్లాలంటే ఒక స్పెషల్ టైమ్ అనేది ఒకటి ఉంటుంది. అది తెలియకపోతే ఎండాకాలం ఎడారిలోకి వెళ్లినట్లే ఉంటుంది పరిస్థితి. మరి ఈ డిసెంబర్ నెలలో వెకేషన్‌కు వెళ్లాలనుకునేవారికి బెస్ట్ డెస్టినేషన్ ప్లేస్ ఏంటో తెలుసా? అదెక్కడుందో తెలుసా? దాని స్పెషాలిటీస్ ఏంటో తెలుసా? వీటన్నింటికీ ఒకే సమాధానం 'అరకు'. అవును 'అరకు' అందాలు డిసెంబర్ నెలలో రెట్టింపు అవతాయి. ఉదయాన్ని పొగమంచు తెరలే యువరాణిలా కనిపించే అరకు.. ఆ పొగమంచు తొలగే కొన్ని మరింత సుందరంగా దర్శనమిస్తుంది. డిసెంబర్ నెలలో అక్కడ ఉంటే వాతావరణం, పచ్చదనం, పర్యాటక ప్రాంతాలు అన్నీ కూడా మన మనసును కట్టిపడేస్తాయి. అక్కడి జలపాతాలు, సెలయేర్లు, పర్వతాల అన్నీ కూడా మనకు ప్రశాంతతను, ఉల్లాసాన్ని అందిస్తాయి. డిసెంబర్ నెలలో అరకు.. ప్రకృతిని ఆస్వాదించే వారికి స్వర్గంలా ఉంటుంది. మరి 'అరకు'లో తప్పకుండా చూడాల్సిన ప్రదేశాలేంటో తెలుసా..



**చాపరాయి జలపాతం:**
అరకులోయకు 13 కిలోమీటర్ల దూరంలోనే చాపరాయి జలపాతం ఉంటుంది. పాడేరు అడవుల మధ్యలో నీరు జాలువారుతూ కనువిందు చేస్తాయి. చాపరాయి జలపాతం వద్ద ఫుల్‌గా ఎంజాయ్ చేయవచ్చు. మంచి అనుభూతి కలుగుతుంది.

**కటికి వాటర్‌ఫాల్స్ :**
కటికి జలపాతం అరకుకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో, బొర్రా గుహలకు 7 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సుమారు 100 అడుగులకు పైగా ఎత్తు నుంచి నీరు అలా జారుతుంది. పచ్చని చెట్ల మధ్యలో నుంచి జాలువారే ఈ వాటర్‌ఫాల్ మనసును దోచేస్తుంది. వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.

**బుర్రా గుహలు:**
అరకు లోయ నుంచి బొర్రా గుహలు 26 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. పురాతనమైన, దేశంలోనే అత్యంత లోతైన సున్నపురాయి గుహలు ఇవి. అనంతగిరి హిల్స్ ప్రాంతంలోనే ఈ గుహలు ఉంటాయి. ఈ గుహలు చూడడం ప్రత్యేక అనుభూతి, ఆశ్చర్యం కలిగిస్తాయి. ఓ కొత్త ప్రపంచంలో విహరిస్తున్న ఫీలింగ్ వస్తుంది. అరకు వెళితే బొర్రా గుహలు తప్పక చూడాల్సిన ప్లేస్.

**ట్రైబల్ మ్యూజియం:**
అరకులోనే ట్రైబల్ మ్యూజియం ఉంటుంది. అరకులోయలో నివసించే గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవనవిధానం, చరిత్రను ఈ మ్యూజియంలో తెలుసుకోవచ్చు. ఇక్కడి వస్తువులు ఆకట్టుకుంటాయి. అరకు వెళ్లిన వార కచ్చితంగా ట్రైబల్ మ్యూజియం సందర్శించాలి.

**అనంతగిరి హిల్స్:**
అరకుకు సుమారు 36 కిలోమీటర్ల దూరంలో అనంతగిరి హిల్స్ ఉంటాయి. ఈ హిల్ స్టేషన్ ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అరకులోయకు వెళ్లిన వారు ఇక్కడికి వెళ్లడం మిస్ కాకూడదు. కాఫీ తోటలు, జలపాతాలు, పచ్చటి వాతావరణం ఆహ్లాదంగా అనిపిస్తుంది. ట్రెక్కింగ్ చేయాలనుకునే వారికి కూడా అనంతగిరి హిల్స్ పర్‌ఫెక్ట్ ప్లేస్‌గా ఉంటుంది. విశాఖపట్నానికి అనంతగిరి హిల్స్ 88 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**లంబసింగి ప్లాన్ చేయవచ్చు:**
అరకు ట్రిప్‌కు వెళ్లిన వారు సమయం చూసుకుని లంబసింగి కూడా వెళితే మంచి అనుభూతి ఉంటుంది. చలికాలంలో లంబసింగి అందాలు కూడా ఔరా అనిపిస్తాయి. ఇక్కడ చల్లటి వాతావరణం ఉంటుంది. శీతాకాలంలో అప్పుడప్పుడు మంచు పడుతుంటుంది. ప్రకృతి మనసులను హత్తుకుంటుంది. అరకులోయకు లంబసింగి 92 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 115 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
వీటన్నింటితో పాటు అరకుకు 35 కిలోమీటర్ల సమీపంలో మత్స్యగుండం ఉంటుంది. ఇక్కడి నీటిలో చేపలు భారీ సంఖ్యలు ఉంటాయి. దీన్ని ఫిష్ పాండ్ అని కూడా అంటారు. పాడేరుకు 15 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంటుంది. పద్మాపురం గార్డెన్స్ అరకుకు మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. టైడా నేచర్ క్యాంప్ కూడా ఆకట్టుకుంటంది. అరకుకు 70 కిలోమీటర్ల దూరంలో దదుమా వాటర్‌ఫాల్స్ ఉంటుంది.











# గంటల తరబడి ఇయర్ ఫోన్స్ వాడేస్తున్నారా..
# అయితే ప్రమాదంలో పడ్డట్టే..



ఇయర్ ఫోన్స్ వాడే అలవాటు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఈ రోజుల్లో దాదాపు ప్రతి ఒక్కరికీ కూడా ఇయర్ ఫోన్స్ అనేవి మొబైల్ ఫోన్‌తో పాటు తమ శరీర అవయంగా మారిపోయాయి. వీటిని ప్రతి చోటకు క్యారీ చేస్తుంటారు. మ్యూజిక్, ఆన్‌లైన్ క్లాసులు, వర్క్ ఫ్రం హోమ్, స్ట్రెస్ రిలీఫ్ ఇలా ఏదో ఒక కారణంతో ఎప్పుడూ ఇయర్ ఫోన్స్‌ను చెవిలో పెట్టే ఉంచడం ఈరోజుల్లో షరామామూలైపోయింది. ప్రయాణాలు చేసే వారు అయితే ఆ ప్రయాణం అంతా కూడా ఇర్‌ఫోన్స్ పెట్టుకుని మ్యూజిక్ వింటూ సీనరీని ఎంజాయ్ చేస్తుంటారు. కానీ వీటి వినియోగంలో జాగ్రత్త పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇయర్ ఫోన్స్ ఎక్కువగా వాడితే వినికిడి సమస్యలు రావడమే కాకుండా శాశ్వతంగా వికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం కూడా ఉందని నిపుణులు చెప్తున్నారు.
ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 బిలియన్ మంది యువత అత్యధిక సౌండ్ పెట్టుకుని సంగీతం వింటుంటారు. పక్కనే ఉన్న వ్యక్తి కేకలు వేసినా వీరికి వినిపించదు. వీరు వీరి లోకంలో ఉంటారు. ఆ స్థాయి సౌండ్‌తో ఇయర్ ఫోన్స్‌ను వినియోగించడం వల్ల వినికి సంబంధిత సమస్యలు తప్పవని వైద్య నిపుణులు అంటున్నారు. ఇదే విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) కూడా ధృవీకరించింది. ప్రస్తుతం 35 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న వారు అధికంగా ఇయర్ ఫోన్‌లు వాడుతున్నారు. వారిలో 50 శాతం మంది వినికి సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్య రానున్న కాలంలో మరింత పెరిగే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్ఓ హెచ్చరిస్తోంది. కావున యువత అంతా కూడా ఇయర్ ఫోన్స్ వినియోగం విషయంలో కాస్తం జాగ్రత్తా ఉండాలని చెప్తున్నారు నిపుణులు.

**శాశ్వత చెవుడు రావొచ్చు..**
అధిక శబ్దింతో ఇయర్ ఫోన్స్ వినియోగిస్తే శాశ్వత చెవుడు కూడా రావొచ్చని వైద్యులు అంటున్నారు. సాధారణంగా మనం ఏదైనా ఒక శబ్దాన్ని వింటున్నాం అంటే అందుకు మన కర్ణబేరి కారణం. మన చెవుకు చేరే శబ్ద తరంగాలను బట్టి కర్ణబేరి వైబ్రేట్ అవుతుంది. తద్వారా చెవిలో ఉండే కండరాలు కదిలి మన మెదడుకు ఆ సౌండ్‌ను అర్థమయ్యేలా చేస్తాయి. అధిక శబ్దంతో సంగీతం వినడం ద్వారా కర్ణబేరిపై పనిభారం పెరుగుతుంది. కర్ణబేరి అతి వేగంగా, బలంగా వైబ్రేట్ అవుతుంది. ఆ సమయంలో చెవిలోని కండరాలను కాపాడుతూ ఉండూ చిన్నపాటి హెయిర్ పార్టికల్స్.. కొంతకాలానికి ఆ హెవీ ఫ్రీక్వెన్సీ వల్ల బలహీనపడతాయి. కొంతకాలానికి అవి పూర్తిగా నిర్వీర్యమవుతాయి. అవి రీజనరేట్ కావు. దాంతో శాశ్వత చెవుడు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ కూడా ఇయర్ ఫోన్స్ వాడే సమయంలో శబ్దాన్ని కాస్తంత తక్కువగా పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇన్ఫెక్షన్లు తప్పవు..**
అంతేకాకుండా గ ఇయర్ ఫోన్స్ పెట్టుకోవడం వల్ల చెవిలో గాలి ఆడదు. దాంతో చెవిలో ఫంగస్, బ్యాక్టీరియాలు పేరుకుపోతాయి. వీటి వల్ల చెవిలో దురద, నొప్పి, చీము కారడం, చెవి పోటు, చెవిలో గుయ్ మనే శబ్ధం వచ్చినట్లు ఉండటం వంటి అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో కర్ణబేరి పొరలో బ్యాక్టీరియా పేరుకుపోవడం వల్ల దానిని క్లీన్ చేయడం కోసం మన శరీరం ఒక విధమైన ద్రవాన్ని విడుదల చేస్తుంది. అది అధికమైనప్పుడు కూడా చెవి సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి బారిన పడకుండా ఉండాలంటే ఇయర్ ఫోన్, ఇయర్ బడ్, బ్లూటూత్ వంటి వాటిని ఎక్కువ సమయం వినియోగించడం మానుకోవాలని సూచిస్తున్నారు.



**సౌండ్ తగ్గించండి బాస్..**
వృత్తి రీత్యా కొందరు ఎక్కువ సేపు ఇయర్ ఫోన్స్ వాడటం అనివార్యమవుతుంది. అలాంటి వారు సౌండ్ తగ్గించుకోవడం ద్వారా ఈ సమస్యల నుంచి కాస్తంత గట్టెక్కొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. శబ్దాన్ని డెసిబెల్స్‌లో కొలుస్తారు. మన వినే శబ్దం 60 డెసిబెల్స్ కంటే తక్కువగా ఉండాలి. అలా ఉంటే మనం ఎక్కువ సేపు ఇయర్ ఫోన్స్ వినియోగించినా పెద్దగా ఇబ్బంది ఉండదు. సమస్య కూడా తీవ్రతరంగా మారదు. అలా కాకుండా సౌండ్‌ను 85 డెసిబెల్స్ న్నా ఎక్కువగా ఉంచితే మాత్రం వినికిడి లోపం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అయితే మన ఫోన్‌లో శబ్ధం ఎన్ని డెసిబెల్స్‌లో వస్తుందో కొలవడం కష్టం. అందుకని ఎప్పుడూ కూడా శబ్దాన్ని ఫోన్‌లో ఇచ్చిన దాంట్లో సగం అంటే 50శాతం పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దాంతో పాటుగా ఎంత వృత్తి, ఉద్యోగమే అయినా ప్రతి గంటలకు ఒక 10 నిమిషాలు అయినా చెవులకు రెస్ట్ ఇవ్వాలని నిపుణులు చెప్తున్నారు.

**హెడ్ ఫోన్స్ వినియోగం మంచిది..**
చాలా మంది రకం ఏదైనా ఇయర్ ఫోన్స్ అనే అంటారు. కానీ ఇయర్ ఫోన్స్ వేరు, హెడ్ ఫోన్స్ వేరు. చెవిలో ఇమిడిపోయేలా ఉండే వాటిని ఇయర్ ఫోన్స్ అంటారు. చెవిపై పెట్టే వాటిని హెడ్ ఫోన్స్ అంటాం. ఇయర్ ఫోన్స్ వినియోగం వల్ల అనేక సమస్యలు వస్తాయి. శబ్దం నేరుగా చెవిలోకి వెళ్లి కర్ణబేరిపై అధిక భారం మోపుతాయి. చెవిలోకి గాలి వెళ్లకుండా చేసి ఇన్‌ఫెక్షన్లు వచ్చేలా చేస్తాయి. కానీ హెడ్ ఫోన్స్ వినియోగిస్తే ఈ సమస్యలు చాలా వరకు రావని వైద్యులు చెప్తున్నారు. కానీ హెడ్ ఫోన్స్‌లో కూడా శబ్ధాన్ని తగ్గించే పెట్టుకోవాలని సూచిస్తున్నారు. హెడ్ ఫోనస్ వినియోగించే సమయంలో శబ్ధం నేరుగా మన చెవిలోకి వెళ్లదు. ఓపెన్ ఏరియా నుంచి చెవిలోకి ప్రవేశిస్తుంది. దాని వల్ల కర్ణబేరిపై భారం పెద్దగా పడదు. దాంతో పాటుగా హెడ్ ఫోన్స్ వినియోగించేటప్పుడు కాసేపటికి ఒక్కసారైన కదిలిస్తుంటాం.. ఆ సమయంలో చెవికి గాలి తగిలి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

**ఇతరులు ఇయర్ ఫోన్స్ వాడొద్దు..**
చాలా మంది పక్కవారి ఇయర్ ఫోన్స్ తీసుకుని వాడేస్తుంటారు. కానీ అలా చేయడం చాలా ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. మన తోబుట్టులవైనా ఒకరి ఇయర్ ఫోన్స్‌ను మరొకరు వాడటం వల్ల లేనిపోని ఇబ్బందులు వస్తాయని, ఇద్దరిలో ఏ ఒక్కరికైనా ఏ రకమైన ఇన్ఫెక్షన్ ఉన్నా.. అది రెండో వ్యక్తికి కూడా సోకుతుందని అంటున్నారు. ఇయర్ ఫోన్లు వాడే వారి చెవుల్లో బ్యాక్టీరియా 7 రెట్లు అధికంగా పెరుగుతుంది. మనం వాడే ఇయర్ ఫోన్స్‌పై కోట్ల రకాల బ్యాక్టీరియాలు ఉంటాయి. మరొకరి ఇయర్ ఫోన్స్ వాడామంటే.. వాటిపై ఉండే బ్యాక్టీరియా అదనంగా మన చెవుల్లోకి చేరి అనేక సమస్యలకు దారి తీస్తుంది.

# అబ్బాయిలూ ఇలా డ్రస్ చేసుకోండి..
# అమ్మాయిలు చూపు తిప్పుకోలేరు

ప్రస్తుతం యువతలో ఫ్యాషన్ సెన్స్ బాగా పెరిగింది. ఏది ఎలా ధరిస్తే మనం బాగా కనిపిస్తాం అన్న ఆలోచనా ఇంకా పెరిగింది. అందుకోసం వాళ్ల రకరకాల కాంబినేషన్స్ ట్రై చేస్తున్నారు. వాటిలో కొన్ని బాగుంటే, మరికొన్ని సోసోగా ఉంటున్నాయి. ఇంకొన్నైతే ఏంటీ వింత అన్నట్లుగా ఉంటున్నాయి. దీంతో అసలు ఎలాంటి డ్రస్‌లు వేసుకోవాలి, ఎలాంటి కాంబినేషన్స్ వేసుకోవాలి, ఒక డ్రస్ వేసుకోవాలంటే అందులో ఎలాంటి కంఫర్ట్స్ చూసుకోవాలి అన్నవి తెలుసుకోవడం కోసం యువత నానా తంటాలు పడుతున్నారు. అందులోనూ కుర్రోళ్లకయితే మరిన్ని సమస్యలు. డ్రస్సింగ్ ఎలా ఉంటే అమ్మాయిలను ఆకర్షించగలుగుతాం అనేది తెలుసుకోవడం కోసం గూగుల్‌కు కూడా విసుగెత్తేలా బ్రౌజ్ చేసేస్తుంటారు. అలాంటి వారి కోసం కొన్ని అద్భుతమైన డ్రస్సింగ్ టిప్స్ చెప్తున్నాం. వాటిని పాటించండి.. అమ్మాయిలు మీపై నుంచి చూపు తిప్పుకోలేరు. మీ స్టైల్, గ్రేస్ అన్నీ ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. అసలు డ్రస్‌లను ఎలా చూస్ చేసుకోవాలో కూడా ఈ ఆర్టికల్ చదివితే మీకే ఒక క్లారిటీ వచ్చేస్తుంది.
నిజం చెప్పాలంటే చాలా మంది అబ్బాయిలు బాడీ బాగా ఉంటే అమ్మాయిలు ఆటోమేటిక్‌గా ఇష్టపడతారు అనుకుని బాడీని పెంచడంపై అమితమైన దృష్టి పెడతారు. డ్రస్సింగ్ మాత్రం ఏదో వేసుకున్నాం అంటే వేసుకున్నాం అన్నట్లుగానే ఉంటుంది. డ్రెస్సింగ్ విషయంలో మాత్రం అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు ఫ్యాషన్ సెన్స్ తక్కువనే చెప్పాలి.
చాలా మంది అబ్బాయిలు ఏ డ్రెస్సులు పడితే అవి వేసేస్తారు. కానీ, ఈ రోజుల్లో అందంగా, స్టైలిష్‌గా ఉన్నవారికే డిమాండ్ ఎక్కువ. డ్రెస్సింగ్ విషయంలో అబ్బాయిలు గందరగోళంగా ఉంటారు. అయితే, స్టైలిష్‌తో పాటు కూల్‌గా కనిపించాలంటే.. అబ్బాయిలు కొన్ని చిట్కాలు ఫాలో కావాల్సిందే.

## డ్రస్ సెలక్షన్

మన శరీర ఆకృతిని బట్టి బట్టలు టైట్‌గా ఉండాలా, లూజ్‌గా ఉండాలా అనేది చూజ్ చేసుకోవాలి. లావుగా ఉన్న వ్యక్తులు టైట్ దుస్తుల్ని వేసుకోవద్దు. అలా వేసుకుంటే టైట్ దుస్తుల్లో వారి పొట్ట బయటకు కనిపించే అవకాశం ఉంది. అందుకే మీ శరీర ఆకృతిని బట్టి.. డ్రెస్సులు సెలెక్ట్ చేసుకోండి. సన్నగా ఉన్న అబ్బాయిలు కూడా దుస్తుల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు వదులు బట్టలు సెలెక్ట్ చేసుకోకండి. ఇలా చేయడం వల్ల కట్టెపుల్లకు తొడుగు వేసినట్లు కనిపించే అవకాశాలు ఉన్నాయి. మన శరీరానికి తగ్గట్టుగా ఒక్క అంగుళం వదులుగా ఉండే దుస్తులు సెలక్ట్ చేసుకోవడం ఉత్తమం. ఇక మీ అభిరుచిని బట్టి, మీ శరీర ఆకృతిని దృష్టిలో ఉంచుకుని డ్రస్‌లు సెలక్ట్ చేసుకోండి.



**డ్రస్ కలర్:**
మనం వేసే దుస్తుల రంగే మనకు అసలు అట్రాక్షన్‌ను తెచ్చిపెడుతుంది. కూల్‌గా కనిపించాలంటే బట్టల రంగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తల దగ్గర నుంచి పాదాల వరకు ఒకే రకమైన కలర్స్ వేస్తే అంతగా నప్పదు. అందుకని జీన్స్ ప్యాంట్ వేస్తే దానికి కాంట్రాస్ట్ కలర్ చొక్కా ధరించడానికి ట్రై చేయండి. అలాగే షర్ట్, టీ షర్ట్స్ కలర్ బట్టి.. కాంట్రాస్ట్ కలర్ ప్యాంట్స్ సెలెక్ట్ చేసుకోండి. ఏ కలర్ బట్టలు వేసుకుంటే మీరు బాగా కనిపిస్తారో.. ఒకటికి పది సార్లు చెక్ చేసుకుంటే మంచిది.

**సైజ్:**
మనం వేసుకునే దుస్తులు ఎప్పుడైనా మనకు సూట్ అయ్యేలా ఉండాలి. అంతేకాని మరీ చిన్నగా, లేదా పెద్దగా ఉండకూడదు. ఆకర్షణీయంగా కనిపించాలంటే సరైన సైజ్ డ్రెస్సులు సెలెక్ట్ చేసుకోవడంపై కూడా దృష్టి పెట్టాలి. సైజ్ ఎక్కువ ఉన్న బట్టలు వేసుకుంటే లావుగా కనిపిస్తారు. అందుకే స్లిమ్ ఫిట్ సైజుపై దృష్టి పెట్టండి. దుస్తులు కొనేటప్పుడే.. ఒకటి రెండు సార్లు సైజు సరిచూసుకోండి. అంతేకాకుండా టైట్ దుస్తుల్ని కూడా సెలెక్ట్ చేసుకోవద్దు. ఇలా చేయడం వల్ల మీకు ఇబ్బందిగా అనిపించవచ్చు. టైట్ దుస్తుల్లో కొందరి లుక్ అస్సలు బాగోదు. అందుకే.. అసౌకర్యంగా ఉండే దుస్తుల్ని ఎంచుకోవద్దు.

**షూస్:**
డ్రస్ బాగుండాలే కానీ షూస్‌ది ఏముంది అని అనుకోవద్దు. మనం ఎవరినైనా కొత్తవారిని కలిసినప్పుడు వాళ్లు ముందుగా గమనించేది మన షూస్, చెప్పులనే అని తాజా అధ్యయనం చెప్తోంది. కాబట్టి మీరు వేసే షూస్‌పై కూడా దృష్టి పెట్టాల్సిందే. ముఖ్యంగా షూస్ దుస్తులకు సరిపోయేలా ఉండాలి. జిమ్ వేర్ ధరిస్తే.. దానికి తగ్గ స్పోర్ట్ షూస్ ధరించండి. స్టైల్‌గా కనిపించడం కోసం డిఫరెంట్ స్నీకర్స్ వాడండి. బూట్లు మిమ్మల్ని చాలా స్టైలిష్‌గా కనిపించేలా చేస్తాయి. కాబట్టి సరైన షూస్ ఎంచుకోండి.

**గడ్డం, జుట్టు ముఖ్యం:**
అబ్బాయిల అందంలో జుట్టు, గడ్డం కూడా కీ రోల్ ప్లే చేస్తాయి. ఎంత స్టైలిష్ బట్టలు వేసుకున్నా.. హెయిర్ స్టైల్ సరిగ్గా లేకపోతే.. మీ లుక్ అంతా పాడైపోతుంది. స్టైల్, కూల్ లుక్ కోసం మీ హెయిర్ స్టైల్ కీలకం. అంతేకాకుండా గడ్డం కూడా స్టైల్ లుక్ ఇస్తుంది. కొందరు గడ్డం ఉండే చాలా స్టైల్‌గా కనిపిస్తారు. కొందరు గడ్డం లేకపోతే బాగుంటారు. అందుకే హెయిర్ స్టైల్, గడ్డం విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. గడ్డం ఉంటే బాగుంటారు కదా అని దేవదాస్ పెంచినట్లు పెంచడం కాదు. దాన్ని కూడా మన ఫేస్‌కు సరిపోయేలా మెయింటెయిన్ చేయాలి. అప్పుడే మనకు అది స్టైల్‌ను తెచ్చిపెడుతుంది.

## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..!



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పిస్తారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ నాలుగో తేదీన ముగుస్తాయి. తొలి విడత సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకూ, మలి విడత సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకూ కొనసాగుతాయి.

## మూడు శాతం వృద్ధి చెందిన రిలయన్స్ షేర్.. కారణమిదే..!




**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్లో శుక్రవారం రిలయన్స్ షేర్లు దాదాపు మూడు శాతం లాభాలతో ముగిశాయి. గురువారం రిలయన్స్ ఇండస్ట్రీస్ మూడో త్రైమాసికంలో 7.4శాతం నికర లాభం గడించిన సంగతి తెలిసిందే. బీఎస్ఈలో రిలయన్స్ షేర్ 2.57 శాతం వృద్ధితో రూ.1301.30 వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 4.44శాతం పుంజుకుని రూ.1,3265.10లకు దూసుకెళ్లింది. మరోవైపు ఎన్ఎస్ఈలో రిలయన్స్ షేర్ 2.64శాతం వృద్ధితో రూ.1,300 వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 4.70 శాతం వరకూ వృద్ధితో రూ.1,326 వరకూ పెరిగింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.44,115.55 కోట్లు పెరిగి రూ.17,60,967.69 కోట్లకు చేరుకుంది. బీఎస్ఈలో 15.14 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 293.66 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.

రిటైల్ బిజినెస్ పుంజుకోవడం, టారిఫ్‌ల పెంపుతో జియో ఆదాయం పెంపు, ఆయిల్ అండ్ గ్యాస్‌తో కూడిన పెట్రో కెమికల్ బిజినెస్ నికరంగా లాభాలు గడించడంతో డిసెంబర్ త్రైమాసికంలో రిలయన్స్ 7.4 శాతం వృద్ధితో రూ.18,540 కోట్ల నికర లాభం గడించింది. ఏడాది క్రితం అంటే 2023-24 తృతీయ త్రైమాసికంలో రూ.17,265 కోట్ల నికర లాభం పొందింది.

## మూడు రోజుల లాభాలకు బ్రేక్..

**నష్టాల్లో ముగిసిన సూచీలు..**



**ముంబయి:** భారతీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. వరుసగా మూడు సెషన్లలో లాభపడ్డ సూచీలు శుక్రవారం నష్టాల్లోకి జారుకున్నాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ప్రపంచ మార్కెట్లలో మందగమనం నేపథ్యంలో మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలయ్యాయి. ఆ తర్వాత సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. క్రితం సెషన్ (77,042.82)తో పోలిస్తే 77,069.19 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 77,069.19 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 76,263.29 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద ముగిసింది.నిఫ్టీ 108.60 పాయింట్లు పతనమై.. 23,203.20 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,975 షేర్లు లాభపడగా.. మరో 1,797 షేర్లు పతనమయ్యాయి. ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో నిఫ్టీలో నష్టాలను చవిచూశాయి. బీపీసీఎల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందాల్కో ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, హిందాల్కో ఇండస్ట్రీస్ ఉన్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఐటీ, బ్యాంక్ సూచీలు ఒక్కొక్కటి 2శాతం పతనం కాగా.. ఆయిల్, గ్యాస్, పవర్, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ క్యాపిటల్ గూడ్స్, రియాలిటీ, మెటల్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు పెరిగాయి.

## ఈసారి జీడీపీ 6.4 శాతమే..

**భారత్ వృద్ధికి ఫిక్కీ కోతలు**

**గతంలో 7 శాతంగా అంచనా**




**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉంటుందని పేర్కొనగా.. ఇప్పుడు అర శాతానికిపైగా కుదించడం గమనార్హం. ఇక 2023-24 దేశ జీడీపీ వృద్ధిరేటు 8.2 శాతం గా ఉన్నది. ఈ క్రమంలో తాజా అంచనా మరింతగా వృద్ధిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. గత నెల డిసెంబర్‌లో ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణుల నుంచి సేకరించిన స్పందనలు, అభిప్రాయాల ఆధారంగా ఈ సర్వేను ఫిక్కీ చేపట్టింది. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందన్న దానిపై నిపుణులు స్పందిస్తూ.. స్వల్ప కాలంలో ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు మందగించవచ్చున్నారు. ఇక అధిక సుంకాలు, వీసా నిబంధనలు కూడా కొంత ఇబ్బందికరమేనన్నారు. రూపాయి మారకం విలువ స్థిరత్వాన్ని కోల్పోవచ్చని చెప్తున్నారు. ఇదిలావుంటే వ్యవసాయోత్పత్తి పెంపు, మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల వ్యవస్థ బలోపేతం వంటివి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించగలవని సూచించారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా

# ఖేల్ రత్న



**అవార్డు అందుకున్న షూటర్ మనుభాకర్, చెస్ చాంపియన్ గుకేశ్**

**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, చెస్ వరల్డ్ చాంపియన్ డీ గుకేశ్.. ఇవాళ మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డులు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆ అవార్డులను స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ వేడుక జరిగింది. హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్ గోల్డ్ విన్నింగ్ హైజంపర్ ప్రవీణ్ కుమార్ కూడా ఖేల్ రత్న పురస్కారాలను అందుకున్నారు. 22 ఏళ్ల షూటర్ మను భాకర్.. ఒకే ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్ గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది. గత ఏడాది ఆగస్టులో జరిగిన క్రీడల్లో ఆమె 10మీ ఎయిర్ పిస్తోల్, 10మీ ఎయిర్ పిస్తోల్ మిక్స్‌డ్ టీం ఈవెంట్లలో బ్రాంచ్ మెడల్ గెలుచుకున్నది. ఇక 18 ఏళ్ల చెస్ చాంపియన్ గుకేశ్.. యువ ప్రపంచ చాంపియన్ అయ్యాడు. చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి ఆ టైటిల్ అందుకున్నాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో చెస్ క్రీడాకారుడిగా నిలిచాడు.





## టీమ్ఇండియాలో ప్రక్షాళన షురూ..



**పది పాయింట్లతో బీసీసీఐ పాలసీ**

**నిబంధనలు మరింత కఠినతరం**

**ముంబై:** గత నాలుగైదు నెలలుగా టెస్టులలో అత్యంత చెత్త ప్రదర్శన, ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్తును దక్కించుకోవడంలో విఫలమవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు, సీనియర్ల పేలవ ఆటతీరు నేపథ్యంలో బీసీసీఐ జట్టులో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. భారత జట్టు ఆస్ట్రేలియా నుంచి తిరిగొచ్చాక.. కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో పాటు కొంత మంది బోర్డు ముఖ్యులతో బీసీసీఐ సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో గంభీర్.. జట్టు ప్రక్షాళనలో భాగంగా పలు కీలక సూచనలు చేశాడు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ బీసీసీఐ గురువారం పది పాయింట్లతో కఠినమైన కొత్త పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం క్రికెటర్లందరూ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండాలని బోర్డు స్పష్టంగా పేర్కొంది. ఇందుకు ఎవరూ అతీతులు కారని తెలిపింది.

దేశవాళీ టోర్నీల్లో ప్రతీ ఒక్కరూ ఆడాల్సిందేనన్న బోర్డు.. జాతీయ జట్టుకు ఎంపికయ్యేందుకు ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటామని కుండబద్దలు కొట్టింది. దేశవాళీల ద్వారా స్థానిక యువతకు స్టార్ క్రికెటర్లతో ఆడే అవకాశం లభిస్తుందని, తద్వారా వారి అనుభవం పనికొస్తుందని పేర్కొంది.

## ఫిబ్రవరిలో డబ్ల్యూపీఎల్..

**వడోదరలో మొదలై.. ముంబైలో ముగియనున్న టోర్నీ**

**నాలుగు నగరాల్లో నిర్వహణ వడోదర, లక్నోకు అవకాశం**

**ఫిబ్రవరి 14న మొదలు.. 15న ఫైనల్**




**ముంబై:** అమ్మాయిల ధనాధన్ క్రికెట్‌కు రంగం సిద్ధమైంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే నెల 14 నుంచి మార్చి 15 దాకా నెల రోజుల పాటు పోటీ క్రికెట్ వినోదాన్ని డబ్ల్యూపీఎల్ అందించనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం డబ్ల్యూపీఎల్-3 షెడ్యూల్‌ను ప్రకటించింది. 20 లీగ్ మ్యాచ్‌లు, 2 నాకౌట్ మ్యాచ్‌లు (మొత్తం 22) జరుగబోయే ఈ మెగా టోర్నీని వడోదర, బెంగళూరు, లక్నో, ముంబై నగరాలలో నిర్వహించనున్నారు. గతేడాది ఢిల్లీ, బెంగళూరు, ముంబైలలో ఈ టోర్నీని నిర్వహించగా తాజాగా ఢిల్లీ స్థానంలో వడోదర, లక్నో చేరాయి. ఫిబ్రవరి 14న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) గుజరాత్ జెయింట్స్‌తో మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానుంది.

ఫిబ్రవరి 14న బరోడా (వడోదర)లో కొత్తగా నిర్మించిన బీసీఏ స్టేడియంలో తొలి ఆరు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఐదు జట్లూ ఇక్కడ నుంచే తమ టైటిల్ వేటను మొదలుపెడతాయి. ఫిబ్రవరి 21 నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యే ఈ టోర్నీలో మార్చి 1 వరకు 8 మ్యాచ్‌లు జరుగుతాయి. మార్చి 3 నుంచి 8 దాకా లక్నో.. 4 మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుండగా 10 నుంచి టోర్నీ ముంబైలో జరుగుతుంది. ఆఖరి రెండు లీగ్ మ్యాచ్‌ల అనంతరం 13న ఎలిమినేటర్, 15న ఫైనల్ మ్యాచ్‌కు ముంబైలోని సీసీఐ స్టేడియం వేదిక కాబోతోంది. డబుల్ హెడర్స్, మధ్యాహ్నం మ్యాచ్‌లు ఏమీ లేని డబ్ల్యూపీఎల్-3లో మ్యాచ్‌లన్నీ రాత్రి 7:30 గంటల నుంచి మొదలవనున్నాయి.

# 5 కిలోల బియ్యం, బ్రష్‌లు, సబ్బులు..

**వాంఖడే గ్రౌండ్స్‌మెన్‌కు ఎంసీఏ బహుతులు**

**ముంబై:** ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్న బోర్డు బీసీసీఐ కాగా రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్‌ల పరంగా చూస్తే ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ)ది ప్రత్యేక స్థానం. దేశవాళీలో ముంబై జట్టుకు, అక్కడి ఆటగాళ్లకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. సంపాదనపరంగా ఎంసీఏకు ఆదాయం తక్కువేమీ కాదు. ఇటీవలే ఎంసీఏ ప్రఖ్యాత వాంఖడే క్రికెట్ మైదానం స్వర్ణోత్సవ వేడుక సందర్భంగా.. స్టేడియం నిర్వహణను చూసుకునే గ్రౌండ్ సిబ్బందికి 'సత్కారం' పేరుతోఎంసీఏ ఇచ్చిన బహుమతులపై విమర్శలు వ్యక్తమవ్ుతున్నాయి. 'జంబో గిఫ్ట్ హ్యాంపర్' పేరిట 178 మంది వాంఖడే సిబ్బందికి ఎంసీఏ పంపిణీ చేసిన ఆ కిట్‌లో.. ఐదు కిలోల బియ్యం, ఐదు కిలోల పప్పు, ఒక టీ షర్ట్, తువ్వాలు, పెన్నులు, సబ్బులు, కొబ్బరి నూనె, దువ్వెన, టూత్ బ్రష్, పేస్ట్, గొడుగు, బెడ్‌షీట్ వంటి కిరాణా కొట్టు సామాన్లున్నాయి. ఇది చూసిన సిబ్బంది అవాక్కై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.












# సంక్రాంతి సినిమాలు ఓటీటీల్లో ఎక్కడెక్కడంటే

సంక్రాంతి, దసరా, దీపావళి వంటి రేస్ లో సినిమాలు వచ్చి హిట్ అయితే భారీ వసూళ్లు అందిస్తుంది అని చెప్పాలి. తెలుగు సినిమా దగ్గర ఎన్నో భారీ సినిమాలు రిలీజ్ కి వచ్చి సంచలన విజయం సాధించాయి. ఈ ఏడాది సంక్రాంతి పూర్తిగా తెలుగుదనంతో నిండిపోయింది. ఇలా మొదటిగా ఈ సంక్రాంతి రేస్ లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన అవైటెడ్ సినిమా "గేమ్ ఛేంజర్"తో స్టార్ట్ చేయగా ఈ సినిమా తర్వాత నందమూరి మాస్ గాడ్ బాలకృష్ణ నటించిన భారీ సినిమా 'డాకు మహారాజ్' వచ్చింది. ఇక ఈ రెండు సినిమాలు తర్వాత చివరి సినిమాగా విక్టరీ వెంకటేష్ నటించిన "సంక్రాంతికి వస్తున్నాం"తో వచ్చారు. కాగా ఈ అన్ని సినిమాల్లో ఒకో దానికి ఒక్కో టాక్ నడిచింది.

ఈ సినిమా హక్కులు ప్రముఖ సంస్థ అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకోగా అందులో మూడు లేదా నాలు వారాల్లోనే వచ్చేస్తుంది అని తెలుస్తుంది. దిల్ రాజు సినిమాలకి ప్రైమ్ వీడియో వారికి ఎప్పుడు నుంచో ఒక అండర్ స్టాండింగ్ ఉంది. సో గేమ్ ఛేంజర్ ని ఈ మూడు నాలుగు వారాల్లోనే ఆశించవచ్చు.ఇక నెక్స్ట్ కొల్లి బాబీ దర్శకత్వంలో తెరకెక్కించిన "డాకు మహారాజ్" సినిమాని వరల్డ్ ఫేమస్ ఓటిటి సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్నారు. కాగా ఈ సినిమా కూడా కేవలం 28 నుంచి 30 రోజుల్లోపే వచ్చేస్తుంది. మరి నిర్మాత నాగవంశీ తన సినిమాలుకి నెల రోజులు చాలని నెల లోపే ఓటిటిలో వచ్చినా తనకెలాంటి ఇబ్బంది లేదని చెప్పేసారు.

సో ఇది కూడా నెలలో గ్యారెంటీ అంటే ఫిబ్రవరి మధ్యలోనే వచ్చేస్తుంది. ఇక ఫైనల్ గా అనీల్ రావిపూడి తెరకెక్కించిన ఎంటర్టైనర్ "సంక్రాంతికి వస్తున్నాం" కొంచెం అనుమానమే అని చెప్పాలి. ఎందుకంటే ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు జీ5 సొంతం చేసుకోగా ఈ సినిమా మాత్రం మిగతా వాటిలా నెల లోపు వచ్చే అవకాశాలు తక్కువ అని చెప్పవచ్చు. జీ5 కి ఇచ్చే సినిమాలు దాదాపు నెల టైం లైన్ లో రావడం లేదు. సో దీనికి మాత్రం సమయం పట్టొచ్చు అని చెప్పాలి.

ఇంట్రెస్టింగ్ గా ఇపుడు ఉన్న సంక్రాంతి సినిమాల్లో దీనికే మంచి హిట్ టాక్ వచ్చింది. సో థియేటర్స్ లో ఈ సినిమా రన్ గట్టిగానే ఉంటుంది అని చెప్పొచ్చు. సో సంక్రాంతికి వస్తున్నాం మాత్రం ఫిబ్రవరి మూడో వారం లేదా నాలుగో వారం లోనే రావచ్చేమో చూడాలి.

# అనిల్ రావిపూడికి వరుస హిట్స్

తెలుగు చిత్ర పరిశ్రమలో వరుస హిట్స్ అందుకున్న దర్శకుల లిస్ట్ చాలా తక్కువ. ఇక అలాంటి వాటిలో క్రమంగా అత్యంత విజయవంతమైన దర్శకుడిగా ఎదిగారు అనిల్ రావిపూడి. ఈ కమర్షియల్ మేకర్ వరుస బ్లాక్‌బస్టర్లతో తన ప్రత్యేకతను నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన ప్రతి సినిమా ఘనవిజయం సాధించడం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది.

అనిల్ పటాస్ సినిమాతో తన సినీ ప్రయాణాన్ని మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఇక లేటెస్ట్ గా సంక్రాంతి కానుకగా విడుదలైన సంక్రాంతికి వస్తున్నాం సినిమా కూడా ఈ విజయ పరంపరలో తన స్థానాన్ని సంపాదించుకుంది. ఈ సినిమాలో వెంకటేశ్ హీరోగా నటించగా ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటించారు. సినిమా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన అందుకుంది.

అమెరికా బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా 1 మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకుంది. ఇది అనిల్ రావిపూడి కెరీర్‌లో ఐదవ మిలియన్ డాలర్ చిత్రం కావడం విశేషం. గతంలో భగవంత్ కేసరి, ఎఫ్3, సరిలేరు నీకెవ్వరు, ఎఫ్2 సినిమాలు కూడా ఈ ఘనత సాధించాయి. అనిల్ రావిపూడి ప్రతి కథను కూడా కామెడీ యాక్షన్ అలాగే ఫ్యామిలీ డ్రామాలతో హైలెట్ చేస్తూ అన్ని వర్గాల ఆడియెన్స్ ను ఆకట్టుకుంటున్నాడు. ముఖ్యంగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మరోసారి వెంకటేశ్ తన టైమింగ్ తో ఎట్రాక్ట్ చేశారు. ఈ చిత్రంలో కామెడీ, ఇద్దరు హీరోయిన్స్ మధ్య నలిగిన హీరో పరిస్థితిని మంచి కథాంశంతో చూపించారు. అనిల్ రావిపూడి ప్రస్తుతం 8/8 బ్లాక్‌బస్టర్లను అందుకున్న అరుదైన దర్శకుడిగా నిలిచారు. సుప్రీమ్, రాజా ది గ్రేట్ సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద సాలీడ్ వసూళ్ళను అందుకున్నాయి.






# బాక్సాఫీసు కలెక్షన్లతో దూసుకుపోతున్న 'సంక్రాంతికి వస్తున్నాం'

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతోంది. విడుదలైన మూడు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ. 106 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. అంతే కాదు, వెంకటేశ్ అనిల్ రావిపూడి హ్యాట్రిక్ కొట్టారు ఎఫ్2, ఎఫ్3, సంక్రాంతికి వస్తున్నాం.

మూడుసార్లు రూ.100 కోట్లకు పైగా వసూలుచేసిన కాంబినేషన్‌గానూ ఈ జోడీ నిలిచింది. అమెరికాలోనూ ఈ చిత్రం మంచి వసూళ్లు రాబడుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో 1 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ అనిల్ రావిపూడి సంతోషం వ్యక్తంచేశారు. తాను దర్శకత్వం వహించిన గత నాలుగు చిత్రాలు వరుసగా మిలియన్ డాలర్లతో పాటు, రూ.100 కోట్లు వసూలుచేశాయని, ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' అయిదో చిత్రమని ఆనందం వ్యక్తంచేశారు. ఇక బుక్‌మై షోలోనూ ఈ మూవీ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

మూడు రోజుల్లో 1.5 మిలియన్ టికెట్లు విక్రయమైనట్లు బుక్‌మై షో తెలిపింది. ఒకవైపు సంక్రాంతి సెలవులు, మరోవైపు వీకెండ్ కలిసి రావడంతో థియేటర్లకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా ఏపీ, తెలంగాణల్లో 220 + షోలను అదనంగా ప్రదర్శిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీకి అమెరికాలో లభిస్తున్న ఆదరణకు నిర్మాత దిల్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు.

# హరిహర వీరమల్లు నుంచి సాంగ్ ప్రోమో విడుదల

హరిహర వీరమల్లును తొలుత క్రిష్ జాగర్లమూడి స్టార్ట్ చేసినప్పటికీ.. ప్రాజెక్ట్ మధ్యలోనే ఆయన దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో చిత్ర నిర్మాత ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ పగ్గాలు చేపట్టారు. దాదాపుగా షూటింగ్ పూర్తి చేసినప్పటికీ .. ఒక్క పవన్ కళ్యాణ్ పార్ట్ మాత్రమే మిగిలి ఉంది. అయితే వీరమల్లు షూటింగ్‌లో పవన్ పాల్గొంటారంటూ ఇప్పటి వరకు రకరకాల కథనాలు వచ్చాయి. కానీ అవన్నీ గాసిప్స్‌గానే మిగిలిపోయాయి. అయితే కొద్ది రోజుల క్రితం మాత్రం పవర్ స్టార్ అభిమానులు పూనకాలతో ఊగిపోయే న్యూస్ బయటికొచ్చింది. డిప్యూటీ సీఎం షూటింగ్‌లో పాల్గొన్న ఫోటోను నిర్మాత ఏఎం రత్నం ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. వీరమల్లు మిమ్మల్ని మార్చి 28, 2025న థియేటర్‌లలో కలుస్తారంటూ రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు. అది వినగానే పవన్ అభిమానులు పండగ చేసుకున్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏఎం రత్నం అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన ఇస్మార్ట్ బ్యూటీ ఫేమ్ నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యానిమల్ విలన్ బాబీ డియోల్ ఔరంగజేబుగా కనిపించనున్నారు. నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, పూజిత పొన్నాడ, సచిన్ ఖేడేకర్, రఘుబాబు, సుబ్బరాజు తదితరులు కీలకపాత్ర పోషిస్తున్నారు. రిలీజ్ టైం దగ్గరపడుతుండటంతో షూటింగ్‌ను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రమోషన్ కార్యక్రమాలను చిత్ర యూనిట్ వేగవంతం చేసింది.సంక్రాంతికి వీరమల్లు నుంచి ఏదో ఒక అప్‌డేట్ ఖచ్చితంగా ఉంటుందని అభిమానులు ఊహించారు, మేకర్స్ సైతం ఈ సినిమాలోని ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రోమో రిలీజ్ చేసింది. చెప్పినట్లుగానే "వినాలి.. వీరమల్లు మాట చెబితే వినాలి ' అనే సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటను స్వయంగా పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ఆలపించగా.. కీరవాణి సంగీతం అందజేశారు. ఏం గురాయించి చూస్తున్నవ్.. భయపెట్టనీకా? , చాలా మందిని జూసినాం అంటూ తెలంగాణ యాసలో పవన్ చెప్పిన డైలాగ్స్ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తున్నాయి. ఈ లిరికల్ వీడియోలో పవన్ , నాజర్, కబీర్ సింగ్ దుహాన్‌లు కనిపిస్తున్నారు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.